# రెక్కలున్న పిల్ల

- ఎస్. జయ

**“నీ**కేమన్నా పిచ్చా ఉందుండి ఆశనా పెళ్ళి చేసుకునేది? ప్రేమా పిచ్చీ ఒకటే అన్నారు కానీ పెళ్లీ పిచ్చీ ఒకటనలేదు'' - రవిశంకర్ మురళిని ఎగతాళి చేశాడు-

''.......''

''ఆశగురించి ఒక విషయం చెప్పనా నొచ్చుకోకు మరి. ప్రేమ కోసమై వలలో చిక్కుకున్నావేమో'' నని మురళి కళ్ళల్లోకి చూశాడు రవిశంకర్. ఆ కళ్ళల్లో ఏ ఉత్సుకత కనిపించలేదు. మాట్లాడ్డానికి కాసేపు తటపటాయించాడు రవిశంకర్. దాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఈలోగా సిగరెట్ వెలిగించాడు.

రవిశంకర్, మురళి మంచి స్నేహితులు. ఇద్దరూ ఒకే కాలేజీలో లెక్చరర్లు. ఒకరు ఎకనామిక్స్, మరొకరు పొలిటికల్ సైన్స్. ఒకే యూనివర్సిటీలో చదువుకున్నారు. ఒకే స్టూడెంట్ యూనియన్‌లోనూ పనిచేశారు. వారి మధ్య దాపరికాలు లేవు.

''ఆశకు రెక్కలున్నాయి. ఎప్పుడైనా నీ చేతుల్లోంచి ఎగిరిపోవచ్చు!'' రహస్యం చెబుతున్నట్లు చెప్పాడు రవిశంకర్.

మురళి మందహాసం చేస్తూ ''ఆశ రెక్కల్ని చూశావా'' అడిగాడు.

''చూళ్లేదు కాని, రెక్కల చప్పుడు చాలాసార్లు విన్నాను. ఆమె దగ్గరగా వచ్చిందంటే చాలు, రెక్కల చప్పుడు వినిపిస్తుంది. భయంతో వణికిపోతాను. ఆశవైపు చూడాలన్నా నాకు భయమే. నువ్వు చూశావా'' ఎదురు ప్రశ్న వేశాడు.

మురళి వైపు జాలిగా చూస్తూ రవిశంకర్ మళ్ళీ అన్నాడు. ''నువ్వు చూసి ఉండవు. విని ఉండవు. ప్రేమ మైకంలో ఉన్నావు కదా!''

''అట్లా జాలిగా చూడకు. నేనేమీ చిక్కుల్లో పడలేదు. ఆశకు రెక్కలున్నాయని తెలుసు. ఆమె వ్యక్తిత్వం చూసి స్నేహం చేశాను. ఆమె రెక్కల్ని చూసి ప్రేమించాను. కలిసి ఉందామనుకుంటున్నాం.''

''ఇది... ఆశ నిర్ణయమే కదా!''

''పెళ్ళంటే ఏమిటి ఒక ఇంట్లో ఇద్దరిని బంధించి కాపురం చేయండి అని అందరూ ఆమోదించడమా మా మధ్య ప్రేమ ఉన్నన్ని రోజులు కలిసి వుంటాం. లేనప్పుడు ఇంత సింపుల్‌గానూ విడిపోతాం. కలిసి వుండడానికి పెళ్లిపీటలు, మంగళవాయిద్యాలు అక్కర్లేదు. విడిపోతున్నప్పుడు లాయర్లు, కోర్టులు, తీర్పులు అక్కర్లేదు.''

''ఇంట్లో చెప్పావా మీ అమ్మా నాన్న ఇష్టపడ్డారా''

''ఆశను మా అమ్మా నాన్నకు పరిచయం చేశాను. చాలామంది తల్లిదండ్రుల్లాగే మా వాళ్లూ అభ్యంతరం చెప్పారు.'' విషయాన్ని చాలా క్లుప్తంగా స్నేహితునికి చెప్పాడు మురళి.

మురళికి తన అమ్మానాన్నల సంగతి తెలుసు. అంగీకరించరని కూడా తెలుసు. కానీ తనేం తప్పు చేయడం లేదు. వారికి విషయం తెలియకుండా రహస్యంగా ఉంచాల్సిన పనేమీ లేదు అనుకున్నాడు.

ఒక రోజు ఆశను ఇంటికి తీసికెళ్లాడు. ఆశను చూడగానే మురళి తల్లి 'అందమైన పిల్ల. బాగా చదువుకున్న అమ్మాయి' అని సంబరపడింది. కానీ ఆశను చూస్తూన్నకొద్దీ ఆమెలో ఆందోళన పెరగసాగింది. ముందు ఆశ కళ్ళల్లో మెరుపు చూసి తొట్రుపడింది. మరికాసేపటికి మాటల్లో సూటిదనం, స్పష్టత చూసి జంకింది.

ఆశ ఒక గంటలోనే ఆ ఇంటితో, ఆ మనుషులతో ఎన్నో ఏళ్ల పరిచయం వున్నట్లు కలివిడిగా మాట్లాడుతూ, ఉల్లాసంగా ఒకసారి తన రెక్కల్ని విప్పి ఆనందంగా ఆడించి, ముడిచింది. అంతే, మురళి తల్లి భయంతో వణికిపోయింది.

ఆశ వెళ్లిపోయాక, ''ఈ పెళ్లి జరగడానికి వీల్లేదు. ఎక్కడో పెళ్ళి చేసుకొని ఆమెను ఇంటికి తెచ్చావా నా శవాన్ని చూస్తావు'' అని బెదిరించింది తల్లి.

''మేము ముందే నిర్ణయించుకున్నాం. వేరే ఇల్లు తీసుకుంటున్నాం.''

''నువ్వు కాక మాకు ఇంకెవరున్నారు. రెక్కలున్న పిల్ల పెళ్లయిన వెంటనే వేరే కాపురం పెట్టిస్తుందేమోనని భయపడి ఈ పెళ్లి వద్దంటున్నాం

కానీ, పెళ్ళి కాకుండానే వేరే పోతావా'' మురళి తండ్రి అడిగాడు.

''పుట్టింటి నుంచి మెట్టినింటికి వలసపోవడానికి ఆమె మామూలు ఆడపిల్ల కాదు. అందుకే మా ఇల్లు మేం ఏర్పాటు చేసుకున్నాం.''

''ఈ ఇల్లు, అవి, ఇవి ఏవీ వద్దంటున్నావు. కనీసం మేము నీ తల్లి దండ్రులమనైనా ఒప్పుకుంటావా'' అడిగింది తల్లి.

''ఆశకు ఆమె తల్లిదండ్రులు ఎంతో, నాకూ మీరు అంతే. అమ్మా యిలకు పుట్టిల్లు తాత్కాలికమనే కదా చెబుతుంది మీ సంప్రదాయం. ఒక తల్లి కడుపున పుట్టిన అమ్మాయికి ఒక సంప్రదాయం, అబ్బాయికి మరో సంప్రదాయం. ఈ తేడా ఒద్దంటున్నాం. అందుకనే వేరే ఇల్లు చూసుకున్నాం. మీకిష్టమైనప్పుడు మీరు మా ఇంటికి రావొచ్చు. మా కిష్టమైనప్పుడు మేము మీ ఇంటికి వస్తాం.''

మురళి వెల్లడించిన భావాలు అతని తల్లికి, తండ్రికి పూర్తిగా కొత్త. వారికి ఎంత అర్థమయ్యాయో వారికే తెలియదు. ఆస్తిలో చిల్లిగవ్వ ఇవ్వ మనో, చచ్చిపోతామనో బెదిరించి ప్రేమ పెళ్ళిళ్లను ఆపగలిగిన సంప్ర దాయం తెలుసుకాని, వాటికి ఏ మాత్రం విలువివ్వని వారితో ఎట్లా గొడవ పడాలో, బెదిరించాలో తెలియదు. సరికదా, మురళి మాటలు వారి మనసుల్ని కలవరపెట్టాయి. ఈ కొత్తదనం ఎట్లా ఉంటుందో చూడాలన్న కుతూహలం కూడా వారిలో కలగక పోలేదు.

''నీకు రెక్కలు వచ్చేట్లుగా పెంచిన మీ అమ్మను చూస్తే నాకు చాలా గౌరవం. మా అమ్మ మా అక్కను ఎప్పుడూ ప్రతి చిన్న పనికి కోప్ప డుతూ, సరిదిద్దుతూ వుండేది. పెళ్లికాకముందే మా అక్కను ఓ మంచి గృహిణిగా తయారు చేసింది మా అమ్మ'' అన్నాడు ఒకరోజు మురళి వంట సమయంలో.

మురళి, ఆశ వారంలో రెండుసార్లు మాత్రమే వంట చేసుకుంటారు. ఎవరికిష్టమైనవి వారు నాలుగు రకాల కూరలు చేసుకొని ఫ్రిజ్‌లో పెట్టు కుంటారు. ఇద్దరు కలిసి ఒక గంటలో వంట పూర్తి చేసేలోగా, తరచుగా వాళ్ల చిన్నప్పటి ఆటపాటల గురించి, చిన్ననాటి స్నేహితుల గురించి, తల్లిదండ్రుల గురించి, ఒక్కోసారి ఫక్తు వంటల గురించి మాట్లాడు కునేవాళ్లు.

మురళి మాటలకు పగలబడి నవ్వింది ఆశ.


''నాకు రెక్కలు రావడానికి మా అమ్మ కారణమని అంత ఖచ్చితంగా ఓ నిర్ణయానికి ఎట్లా వచ్చావు'' అంది.

''మరి!...''

''మా శ్యామల టీచర్ స్నేహం వల్లనే నాకీ రెక్కలు వచ్చాయి'' అని తన రెక్కల్ని చాపి, వాటివైపు మురిపెంగా చూసుకుంది. మురళి లాలనగా ఆశ రెక్కలను సుతారంగా నిమిరాడు. ఆశ కళ్లు గర్వంతో వెలిగి పోయాయి.

''నేను ఎనిమిదో తరగతి చదువుతున్నప్పుడు, శ్యామల టీచర్ మాకు ఇంగ్లీషు టీచ్ చేసేది. ఆమె మాకు ఎన్నెన్నో కొత్త కథలు చెప్పేది. అవి ఏ పుస్తకాల్లో ఉంటాయో, ఆ పుస్తకాలు ఎక్కడ దొరుకుతాయో అడి గాను. ఒకసారి ఇంటికి రమ్మంది. చాలా పుస్తకాలు వున్నాయి. నాకప్పుడే తెలిసింది నాక్కూడా పుస్తకాలంటే ప్రాణమని. నేను ఇంటర్‌లో చేరాక కూడా మా టీచర్ ఇంటికి వెళ్లి బుక్స్ తెచ్చుకొని చదివేదాన్ని. రంగనాయ కమ్మ రాసిన 'జానకి విముక్తి' నవలను బట్టీయం వేశానంటే నమ్ము. ఆ బుక్స్ నాలో కొత్త కొత్త ఆలోచనలు రేకెత్తించేవి.

ఎవరు ఏం మాట్లాడినా ఏదో లోపం ఉన్నట్లు అనిపించేది. నేను



అమ్మ చెప్పినట్టు నడుచుకోవడం లేదని, దీనికంతా కారణం శ్యామ టీచరేనని మా అమ్మ అనుకొంది'' అని చెప్పింది ఆశ.

''కాలేజీలో చేరావు. శ్యామలా టీచర్ ఇంటికి ఎందుకు వెళతావు ఆ పుస్తకాలు చదవడం మానేసేయ్'' ఒక రోజు ఆశ తల్లి అనూరాధ అంది.

''ఆ బుక్స్ చదవడం నాకిష్టం. చదువుతాను.''

''నా తప్పేమీ లేకపోయినా నన్ను కోప్పడితే, గంగిరెద్దులా తలాడిస్తూ వుండలేను.''

ఈ తలబిరుసుతనమే వద్దనేది. ఏ తప్పు లేదంటూనే ఎట్లా మాట్లా డుతున్నావో చూడు. పక్కింటి సీతను చూసి నేర్చుకో. ఎంత అణకువ గల పిల్ల. ఈ వీధికే వన్నె తెచ్చే పిల్ల'' అంది అనురాధ.

''నిజమే, ద్వాపరయుగం సీతకు, ఈ సీతమ్మకు పిసరంత తేడా లేదు. చెప్పినట్టు వినే మంచి పిల్ల. తనకిష్టమైన పని ఏదీ చేయదు. అందరి చేత మంచి అనిపించుకోవడానికి, ఎన్ని బాధలొచ్చినా భరిస్తూ బతకడా నికి తయారవుతోంది. జీవితమంతా దుఃఖిస్తుంది.''

సతీమతల్లి సీతను కూడా తిరస్కరిస్తున్న ఆశ, తన చేతులు దాటి పోయిందని గుర్తించింది అనురాధ. ఈ విషయాన్ని అంగీకరించే స్థితిలో ఆమె లేదు. ఆశను లొంగదీయడానికి తనలో ఎక్కడలేని కాఠిన్యాన్ని బయటపెట్టింది. మొరటుగా తిడుతూ, కొట్టడానికి ఆశ మీదికి చేయి ఎత్తింది.

చెంపమీద దెబ్బ పడకుండా తప్పించుకోగలిగింది ఆశ. కానీ, తల్లి తనను అవమానించడం భరించలేక పోయింది. తన తల్లి ప్రవర్తనను

అసహ్యించుకుంది. తల్లివైపు నిర్లక్ష్యంగా చూసింది. ఆ చూపుతో ఆ తల్లి కూడా సిగ్గుతో కుంచించుకుపోయింది.

మరునిమిషంలో ఆశరెండు మూడు పుస్తకాలు తీసుకొని, ''శ్యామల టీచర్ ఇంటికి వెళ్తున్నాను. ఉదయం వస్తాను'' అంటూ వెళ్లబోయింది.

అనురాధ ఆశవైపు వింతగా చూసింది. ''ఏమిటి ఈ పిల్ల ఇంత జరిగాక కూడా టీచర్ ఇంటికి వెళ్తానంటోంది'' అనుకుంది.

''ఒకటి గుర్తుంచుకో అమ్మా! నేనేం చిన్నపిల్లను కాను. మంచి చెడు నిర్ణయించుకోగలను ఇంకెప్పుడు నా మీదికి చేయి ఎత్తొద్దు'' ఆశ చాల మామూలు విషయంలా చెప్పి వెళ్లిపోయింది. ఆశ ప్రవర్తనకు ఆ తల్లి ఆశ్చర్యపోయింది.

శ్యామల టీచర్ ఇంటికి వెళ్లిన ఆశ, రోజుకన్నా ఎక్కువసేపు చాలా శ్రద్ధగా పాఠాలు చదువుకుంది. అర్ధరాత్రి దాటినా నిద్రరావడం లేదని, చదువుకోడానికి ''రెక్క విప్పిన రెవల్యూషన్'' బుక్ తీసుకుంది. ఫ్రాన్స్‌లో 1968లో జరిగిన విద్యార్థుల ఉద్యమం గురించి, విద్యార్థులపై ప్రభుత్వ దమనకాండ గురించి ఏంజిలా కాట్రొచ్చ రాసిన పుస్తకం అది. ఆ పుస్తకం చదువుతూ, ఆ సంఘటనలు ఇప్పుడే జరుగుతున్నట్టు ఆ విద్యార్థుల్లో తను ఉన్నట్టు అనిపించింది ఆశకు. ఊపిరి తీసుకోవడం కూడా మరిచి పోయి, ఏకబిగిన ఆ పుస్తకం పూర్తిచేసింది. ఒక కొత్త ఉత్సాహం, ధైర్యం వచ్చినట్టు అనిపించింది. నిద్రలోకి ఒరిగిపోయింది.

అందమైన కల. అద్భుతమైన ఆనందమేదో తనలోకి పొగమబ్బులా దూసుకుపోయింది. తనకు రెక్కలు మొలుచుకొచ్చాయి. ఆకాశంలోకి ఎగిరిపోయింది. తెల్ల మబ్బుల మధ్య గిరికీలు కొడుతోంది తను. ఆశ సంతోషంతో కళ్లు తెరిచింది. భుజాలను తడుముకొని ఉలిక్కిపడింది. ఇప్పుడు తనకు రెక్కలున్నాయి. రెక్కల్ని చూసుకొని ఆశ్చర్యపోతుంటే శ్యామల టీచర్ కాఫీ కప్పుతో వచ్చి ''మంచి కలతో మేల్కొన్నట్టున్నావ్'' అంది.

''అవును టీచర్, రెక్కలొచ్చినట్టు కలకన్నాను. మెలకువ వచ్చి చూసు కుంటే నిజంగానే నాకు రెక్కలొచ్చాయి'' అని చూపించింది.

శ్యామల టీచర్ వాటిని చూసి ఆనందంతో పొంగిపోయింది. ''ఎంత అందంగా వున్నాయి ఈ రెక్కలు'' అంది రెక్కలను సుతారంగా నిము రుతూ.


ఆశ తన రెక్కల్ని చూసుకోవడంలో మునిగిపోయింది కాఫీ తాగడం మరిచి.

''ఎందుకైనా మంచిది. రెక్కల్ని ఎవరికంటా పడకుండా జాగ్రత్త చేసుకో. నీ కాళ్ల మీద నీవు నిలబడగలిగే పరిస్థితి వచ్చే వరకు జాగ్రత్త తీసుకో.''

శ్యామల టీచర్ మాటలతో ఆశకు ముందు తన తల్లి, తండ్రి గుర్తొచ్చారు. ముందు వారికంట పడకుండా చూసుకోవాలి అనుకుంది.

ఆశ భయపడినట్టే జరిగింది. ఒక రోజు చదువుకుంటూ మైమరచి రెక్కలు చాపింది ఆశ. అనూరాధ ఎందుకనో అప్పుడే ఆ గదిలోకి వచ్చి కూతురిని చూసి భయపడింది. మరుక్షణంలో ఆశ తన తప్పు తెలుసు కొని, రెక్కల్ని ముడిచి, ఎవరికి కనిపించకుండా జాగ్రత్త చేసుకొంది. మళ్లీ ఏమీ ఎరగనట్టు ఏకాగ్రతతో చదువుకుంటూ కూర్చుంది. అనూ రాధ ఆందోళనగా వెళ్లి భర్తకు విషయం చెప్పి, వెంట తీసుకొని ఆశ వున్న గదిలోకి వెళ్లింది. వారు వచ్చిన అలికిడికి ఏమాత్రం చలించకుండా చదువుకుంటూ వుంది ఆశ. చదువులో నిమగ్నమైపోయిన కూతురిని






చూసి, ఆ తండ్రి, భార్య చెప్పింది నమ్మలేదు. గది బయటకు వెళ్లి, ''నువ్వేదో భ్రమపడ్డావు. మనుషులకు ఎక్కడైనా రెక్కలుంటాయా ఒక్క రోజులో ఆశకు రెక్కలు ఎట్లా వస్తాయి'' అని వెళ్లిపోయారు.

ఆ రోజు నుంచి తల్లి తనను గుచ్చి గుచ్చి చూస్తోందని ఆశ గమనించింది. తన రెక్కల్ని దాచడానికి మరిన్ని జాగ్రత్తలు తీసుకొంది. అలా రెండేళ్ళు నెట్టుకురాగలిగింది. ఒకసారి బాగా జ్వరం వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది ఆశ.

అనూరాధ మందులు ఇస్తూ, సపర్యలు చేస్తూ, ఒక రోజు ఆశ భుజాలు తడిమిచూసింది. రెక్కలున్న విషయం నిర్ధారించుకుంది. భర్తకు చూపించింది. జ్వరంలో వున్న కూతురిని ఏమీ అడగలేకపోయారు. తల్లి, తండ్రికి తన రెక్కల సంగతి తెలిసిపోయిందని ఆశ కూడా గుర్తించింది.

ఒక రోజు ఆశ ఆదమరచి నిద్రపోతుండగా అనూరాధ, ఆమె భర్త కలిసి ఆశ రెక్కల్ని కత్తిరించడానికి ప్రయత్నించారు. రెక్కల మీద కత్తి పెట్టారో లేదో ఆశకు మెలకువ వచ్చింది. తన రెక్కల్ని కత్తిరించవద్దని ఏడుస్తూ ఒక ఉదుటున మంచం దిగి పక్క గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది.

తెల్లారాక, పనిమనిషి తలుపుకొడితే తలుపు తీసింది ఆశ. స్నానం చేసి, కాలేజికి వెళ్లడానికి తయారైంది. తన బుక్సన్నీ రెండు సంచుల్లో సర్దుకొని, నాలుగైదు డ్రస్సులు ఒక సూట్‌కేసులో సర్దుకొంది. వాటిని చూసి 'ఎందుకవన్నీ' అని అనూరాధ అడిగింది.

''నాకు రక్షణ లేని ఇంట్లోనేనుండలేను. ఒకర్నొకరం అనుమానంతో చూసుకుంటూ దొంగల్లాగా బతకడం నాకిష్టంలేదు. పరీక్షలు అయ్యేదాక శ్యామల టీచర్ ఇంట్లో ఉంటాను. తర్వాత ఏదైనా ఉద్యోగం చూసుకుంటాను'' అని విసవిసా వీధిలోకి నడిచి, ఆటోరిక్షా పిలిచింది. తల్లి, తండ్రి చూస్తుండగానే ఆటోలో ఎక్కి వెళ్లిపోయింది. ఆశతో ఒక్క మాట మాట్లాడలేకపోయారు.

రెక్కల్ని చూసి తామెందుకు అంత కిరాతకంగా ప్రవర్తించావమా అని పశ్చాత్తాపపడ్డారు. ఆశను అదుపులో పెట్టాలని ప్రయత్నించి చివరికి తాము తప్పు చేశామని గుర్తించారు. ఆ సాయంత్రమే శ్యామల టీచర్ ఇంటికి వెళ్లి ఆశను ఇంటికి రమ్మని బతిమాలారు.

''వద్దు, మీరు నన్ను అర్థం చేసుకోలేరు. ఈ ప్రేమ చాలు. అప్పుడప్పుడు కలుసుకుంటూ వుందాం. నేనిక్కడ సంతోషంగా వుంటానని మీకు తెలుసు. నా గురించి బెంగ పెట్టుకోవద్దు'' అని తల్లిని ఓదార్చింది. ఆశ ఓదారుస్తుంటే అనూరాధ గుర్తించింది, ''ఆశ ఏనాడు తొందరపడి తనను ఒక్క మాటా అనలేదు. తనే ప్రతిసారీ తను తల్లినని, తన మాట నెగ్గితీరాలని అనాలోచితంగా ప్రవర్తించాన''ని అనూరాధ గుండెలవిసేలా ఏడ్చింది.

ఆ కన్నీళ్లు ఆమెలోని కాఠిన్యాన్నంతా కడిగేసినట్టున్నాయి. ఆరోజు నుంచి ఆమె ఆశను అమితంగా ప్రేమించింది. ఆశ బి.ఎ. పూర్తిచేశాక ఉద్యోగంలో చేరాలనుకుంది. కానీ శ్యామల టీచర్ ఒప్పుకోలేదు. ఆశ తల్లి తండ్రి కూడా ఆశ చదువుకోవాలని చెప్పారు. వారిలో ఈ మార్పు చూసి ఆశ సంతోషపడింది. ఎం.ఎ. పూర్తిచేసిన కాలేజిలో లెక్చరర్‌గా చేరింది. అక్కడే ఆమెకు మురళితో పరిచయమైంది.

''అమ్మ నాకు జన్మనిచ్చింది. మా శ్యామల టీచర్ నాలో చైతన్యం కలిగించారు. చైతన్య వున్నప్పుడే కదా నిజంగా జన్మించినట్టు'' అంది ఆశ. ఆ క్షణంలో ఆశలో మరికొన్ని అందాలు చూసి మురళి ఆనందంతో పొంగిపోయాడు.

''శ్యామల టీచర్‌ను నాకింతవరకు పరిచయం చేయలేదు'' అన్నాడు మురళి. వంట పూర్తిచేసి ఇద్దరూ చేతులు కడుక్కున్నారు.

''ఒక్క నిమిషం'' అంటూ చేతులు గబగబా తుడుచుకొంది నాప్‌కిన్‌తో దాన్ని మురళి చేతుల్లో పెట్టి ఫోటో ఆల్బమ్ తీసుకొచ్చింది. మురళి కూడా గబగబా చేతులు తుడుచుకొని నాప్‌కిన్‌ను ఫ్రిజ్‌కు తగిలించి, ఆల్బంలోకి తొంగిచూశాడు.

''ఇంతకు ముందే ఈ ఫోటో చూపించి, నాకిష్టమైన టీచర్ అని చెప్పావు కానీ, మీ మధ్య ఇంత అనుబంధం వుందని చెప్పలేదు. నాకు ఇప్పుడే శ్యామల టీచర్‌ను చూడాలని వుంది. వెళదామా'' అన్నాడు మురళి.

''ఆమె లేరు. నేను ఎం.ఎ.లో వుండగా చనిపోయారు.''

''సారీ! ఆమెను గుర్తు చేసి బాధపెట్టాను.''

''అదేం కాదు. మన దగ్గర లేని వాళ్లను గుర్తు చేసుకొని కొత్త ఉత్సాహం నింపుకోవాలి. నాకెప్పుడు దిగులు వేసినా శ్యామల టీచర్‌ను

గుర్తుచేసుకుంటాను.''

''అవునా! అయితే, ఆ ఫోటో ఇటివ్వు.''

''దేనికి'' అంటూనే ఆల్బంలోంచి ఫోటో తీసి ఇచ్చింది ఆశ.

''ఫోటో ఎన్‌లార్జ్ చేయించి, లామినేషన్ చేయిస్తాను. బుక్స్ అల్మెరాలో కనిపించేట్టు పెట్టుకుందాం.''

''భలే మంచి ఐడియా'' ఆశ రెక్కల్ని చాపి మురళిని కౌగిలించుకొని ముద్దు పెట్టుకొంది.

''ఎంత రెక్కలుంటే మాత్రం రాత్రి పదకొండు గంటలైంది. ఇంకా ఇంటికి రాలేదు. టీచర్! మీరైనా చెప్పండి ఆశకు. ఈ భయాన్ని భరించడం క్షణక్షణానికి కష్టమవుతోంది'' ఫోటోలోని శ్యామల టీచర్‌కు ఫిర్యాదు చేశాడు మురళి.

అప్పుడే డోర్ బెల్ ట్రింగ్‌మని మోగింది. పరుగున వెళ్ళి బోల్ట్ తీశాడు మురళి. ఎదురుగా ఆశ.

''హమ్మయ్య! ఏమైందోనని భయపడి ఛస్తున్నాను. ఎట్లా వచ్చావ్ ఎక్కడికెళ్లావ్ ఓల్డ్ సిటీలో కమ్యూనల్ టెన్షన్స్ మొదలయ్యాయి. నీ గురించి ఎంత ఆందోళన పడుతున్నానో. నీ కోసం స్వప్నకు, రాధికకు ఫోన్ చేశాను. నువ్వెక్కడికి వెళ్ళింది వాళ్లు చెప్పలేకపోయారు''

''భార్గవి పూణేకు మకాం మారుస్తోందని చెప్పాను కదా! ఈ రోజు ఫ్రెండ్స్‌కందరికీ పార్టీ ఇచ్చింది. తొమ్మిదికంతా వస్తాననుకున్నాను. నీక్కూడా ఏదో మీటింగ్ వుందన్నావు కదా!'' భుజానికున్న బ్యాగ్ అల్మైరాలో పెడుతూ అడిగింది.

''ఓల్డ్ సిటీలో టెన్షన్‌గా వుందని మీటింగ్ రద్దు చేశారు. ఏడుకంతా ఇంటికి వచ్చాను. అప్పట్నుంచీ నీ కోసం ఎదురు చూస్తున్నాను''

''ఏమన్నా చదువుకోవచ్చుకదా!'' అంది కేన్ కుర్చీలో చేరగిలపడుతూ.

''నీ కోసం ఎదురుచూస్తూ వంట చేశాను. ఫోన్ చేస్తావేమోనని నిన్ను తీసుకురావొచ్చని ఎదురుచూస్తున్నాను. ఫోన్ చేయొచ్చుకదా''

''నేను రాగలను కదా! నీ టైం పాడుచేయడం ఎందుకని ఫోన్ చేయలేదు. నేను తినే వచ్చాను. నువ్వు తిను'' డైనింగ్ టేబుల్ దగ్గరకు నడిచారు ఇద్దరు. మురళి వడ్డించుకొన్నాడు.

''రెండు మూడు నెలలుగా చూస్తున్నాను. బాగా పనులు పెట్టుకుంటున్నావు. ఇంటికి వెళ్లి హాయిగా కబుర్లు చెప్పుకుందామని కలలుకంటూ వస్తానా నువ్వు కనిపించకపోయేసరికి దిగులు వేస్తుంది. ఇక వస్తుంది... ఇక వస్తుంది... అనుకుంటూ ఎదురుచూస్తుంటాను. ఉదయమే ఏదన్నా మీటింగ్ వుంటే చెప్పొచ్చు కదా, నేను వచ్చి పికప్ చేస్తాను. త్వరగా ఇల్లు చేరుకుంటాం''

''ఎందుకిలా తయారవుతున్నావ్ మురళీ, నేను పనులు కల్పించుకుంటున్నట్లు, నువ్వూ ఏమైనా పనులు పెట్టుకోవచ్చు కదా''

''నన్నంటున్నావ్, నువ్వెందుకు మారిపోయావు. నువ్వెక్కడికి వెళ్లేదీ నాకెందుకు చెప్పడంలేదు''

''ప్రతీదీ ఎందుకు చెప్పాలి''

''తప్పేమిటి''

''నాకిష్టంలేదు. కొన్ని కొన్ని పనులు నేను చేసుకుంటేనే నాకు హాయిగా వుంటుంది''

''నేను వెంట వుండడం నీకు ఇబ్బందిగా వుంటుందా'' మురళి అన్నాడు.

''ఎందుకుండదు. లేకపోతే నీకు బోర్ కొట్టకుండా నేనూ, నా ఫ్రెండ్స్ చూసుకోవాలి. అదీకాక, నీకు నీ ఫ్రెండ్స్ లేకపోతే ఎట్లా''

''నీకూ నాకూ అంటూ ప్రత్యేకంగా ఎందుకు నీ ఫ్రెండ్సే నాకు ఫ్రెండ్స్''

''అంత ఇరుకుగా జీవించవద్దు మనం. అన్నిట్లో పూర్తిగా కలగలిసిపోవడంలో ఎప్పుడూ ఎవరో ఒకరికి నష్టం కలుగుతుంది. నీ స్నేహితులు, నీ పనులు వేరే వుండాలి. రవిశంకర్ నీకు మంచి ఫ్రెండే కదా. ఎన్నాళ్లయింది మీరు కలుసుకొని''

''ఇప్పుడవన్నీ ఎందుకు నీకు ఇబ్బంది కలక్కుండా చూడ్డం కోసమే నేను నీ కోసం వస్తానంటున్నాను''

''అది నాకిష్టం లేదు. నువ్వు నాకోసం డ్రైవర్‌గానో, పి.ఆర్వోగానో పనిచేయడం నాకిష్టంలేదు. నాకు రెక్కలున్నాయి. నా పనులు నేను చేసుకోగలను''

ఆశ అభిప్రాయాలు ముందు కఠినంగా కనిపించాయి మురళికి. ఆలోచిస్తున్న కొద్దీ అందులో అర్థం చాలా వుందనిపించింది. నిజమే ఒకరి స్వేచ్ఛ మరొకరికి అడ్డంకి కాకూడదు అనుకున్నాడు మురళి.

